డంపింగ్ యార్డుతో అవస్థలు

- మా గ్రామంలో డంపింగ్ యార్డును తీసేయండి
- రోగాల బారిన పడుతున్నాం..
- చర్యలు తీసుకోవాలని ఆందోళన


పసల్వాది గ్రామ శివారులోని డంపింగ్ యార్డు

సంగారెడ్డి టౌన్: జిల్లా కేంద్రానికి సమీపంలో ఉన్న పసల్వాది గ్రామంలో డంపింగ్ యార్డ్ సమస్య మళ్లీ మొదలైంది. సంగారెడ్డి పట్టణంలోని 38వ వార్డులోని చెత్తను పసల్వాది గ్రామ శివారులోని డంపుయార్డుకు తరలిస్తుంటారు. పట్టణంలో సుమారు లక్ష ఇరవై వేల జనాభా ఉంటుంది. ప్రతిరోజు దాదాపుగా 58 మెట్రిక్ టన్నుల చెత్త ఉత్పత్తి అవుతుంది. తడి, పొడి చెత్త వేరే చేసి, సేంద్రియ ఎరువు తయారు చేసే యంత్రాలు ఉన్నప్పటికీ, వాటిని వాడడం లేదు. రోజు చెత్త వేయడంతో యార్డ్ నిండిపోయింది. దీంతో దుర్వాసన ఎక్కువగా రావడంతో ఫసల్వాది గ్రామంతో పాటు తండావాసులకు ఇబ్బందిగా మారింది. గ్రామ శివారులో రెండున్నర సంవత్సరాల క్రితం రెండు ఎకరాల్లో డంపింగ్ యార్డ్‌ను నిర్మించారు. చెత్త పెరగడంతో దుర్వాసన ఎక్కువ వస్తుందని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకుపోయినా సమస్యకు పరిష్కారం చూపడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. దీంతో చిన్నపిల్లలు, వృద్ధులు, గర్భిణులు వ్యాధుల బారినపడుతున్నారని అసహనం వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రం సంగారెడ్డిలో సరైన స్థలం లేకపోవడంతో పచ్చని పొలాలతో ఉంటే పసల్వాదిలో ఏర్పాటు చేసి ప్రజలను రోగాల పాలు చేస్తున్నారని అన్నారు.

ప్రస్తుతం మరో ఐదు ఎకరాల్లో మరింత చెత్త వేయడానికి అధికారులు సిద్ధమవుతున్నారు. దీంతో గ్రామస్తులు పార్టీలకతీతంగా ముందుకు వచ్చి మా గ్రామం నుంచి డంపింగ్ యార్డును పూర్తిగా తొలగించాలంటూ జిల్లా కలెక్టరేట్ ఎదుట పెద్ద ఎత్తున నిరసనకు దిగారు. అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. విషయం తెలుసుకున్న డీఎస్పీ సత్తయ్య పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసి గ్రామస్తులను అక్కడ నుంచి పంపించారు.


డంపింగ్ యార్డ్‌ను తొలగించాలని నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

ఫిర్యాదు చేసినా..



డంపింగ్ యార్డును తొలగించాలని పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. పచ్చని పంట పొలాలతో ఉన్న మా గ్రామంలో డంప్‌యార్డు ఉండడంతో ఇబ్బందులు పడుతున్నామని దీనికి తోడు మరో 5 ఎకరాలు ఏర్పాటు చేస్తామనడం సరైనది కాదని వెంటనే మా గ్రామంలో నుంచి డంప్‌యార్డ్‌ను తొలగించాలి.

-ప్రవీణ్, గ్రామస్తుడు

దుర్వాసన వస్తోంది..



డంపింగ్ యార్డులో పట్టణంలోని వ్యర్థాలను డంప్ చేయడంతో దోమలు ఎక్కువై, దుర్వాసనతో గ్రామస్తులు రోగాల బారిన పడుతున్నారు. మాగ్రామంతో పాటు చుట్టూ పక్కల గ్రామాల ప్రజలకు కూడా ఇబ్బందులు పడుతున్నారు.

-అంజనేయులు, పసల్వాది

మధుమేహాన్ని నిర్లక్ష్యం చేయొద్దు

డాక్టర్ ప్రశాంత్‌రెడ్డి


సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ ప్రశాంత్‌రెడ్డి

జోగిపేట(అందోల్): మధుమేహ వ్యాధిని నిర్లక్ష్యం చేయొద్దని డాక్టర్ ప్రశాంత్‌రెడ్డి అన్నారు. మధుమేహ వ్యాధిపై జోగిపేట లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అందోల్ గురుకుల పాఠశాల విద్యార్థులకు సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రోగ్రామ్ చైర్మన్, లయన్స్ క్లబ్ జిల్లా కార్యదర్శి ఆకుల రాంబాబు ఈ కార్యక్రమానికి అధ్యక్షతన వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ ప్రశాంత్‌రెడ్డి విద్యార్థులకు మధుమేహ వ్యాధిపై లక్షణాలు, నివారణ జాగ్రత్తలపై వివరించారు. శారీరక శ్రమ తగ్గుదలతో మధుమేహం వచ్చే అవకాశం ఉందని తెలిపారు. కళ్లు మసకబారటం, బరువు తగ్గడం, ఎక్కువగా దాహం వేయడం లాంటి లక్షణాలు కనిపిస్తే వైద్యులను సంప్రదించాలని ఆయన సూచించారు. ఫైబర్ ఎక్కువగా ఉండే ఆహారాలను తీసుకోవాలని ఆయన సూచించారు. ప్రతిరోజు నడక, యోగా వంటి వ్యాయామాలు చేయాలన్నారు. తగినంత నిద్రతో కూడా మధుమేహం నియంత్రణ చేయవచ్చని చెప్పారు. మూడు నెలలకు ఒకసారి హెచ్‌బీఏ 1సి పరీక్షలు చేయించుకొని చక్కర స్థాయిలను తెలుసుకోవచ్చన్నారు. మధుమేహం గురించి మీ తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జిల్లా కార్యదర్శిలు డాక్టర్ అనంతరెడ్డి, రాంబాబు, జోన్ చైర్మన్ రామకృష్ణ, క్లబ్ జోగిపేట అధ్యక్షుడు శ్రీకాంత్, కోశాధికారి సంతోష్, సభ్యులు సంతోష్, రాజు, పాఠశాల అధ్యాపక బృందం పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ధర్నా



కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న దివ్యాంగులు

సంగారెడ్డి జోన్: తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా కార్యదర్శి అడివయ్య ఆధ్వర్యంలో సంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పెన్షన్ రూ. 300లను రూ. 3 వేలకు పెంచాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు దివ్యాంగులకు పెన్షన్ రూ.6000, వృద్ధులు, వితంతువులతో పాటు ఇతరులకు రూ.4000 వేలు పెంచి అందించాలన్నారు. అలాగే, ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలన్నారు. నూతనంగా దరఖాస్తు చేసుకున్న వారికి పెన్షన్లు మంజూరు చేయాలన్నారు. సదరం సర్టిఫికెట్లు రెన్యువల్ చేయించాలన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతికి వినతిపత్రం అందజేశారు.

మూఢనమ్మకాలను పారదోలాలి


బహుమతులు అందజేసిన నాయకులు

హత్నూర(సంగారెడ్డి): మూఢనమ్మకాలను పారదోలాలని శాస్త్రీయ దృక్పథాన్ని వెలికి తీసేందుకు చెకుముకి పోటీలు దోహదపడతాయని సిరిపురం మాజీ సర్పంచ్ నరేందర్ అన్నారు. సోమవారం హత్నూరలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మండల స్థాయి చెకుముకి పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులను చైతన్యం చేసేందుకు జనవిజ్ఞాన వేదిక చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. మండలస్థాయిలో ఆయా పాఠశాలల నుంచి 85 మంది విద్యార్థులు పాల్గొనగా అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. అదే విధంగా జిల్లాస్థాయి చెకుముకి పోటీలకు తెలుగు మీడియంలో కొన్యాల జిల్లా పరిషత్ ఉన్నతాపాఠశాల, ఇంగ్లీష్ మీడియంలో సిరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు జనవిజ్ఞాన వేదిక మండల అధ్యక్షుడు ఎండీ. గౌసోద్దీన్, గ్రామ కార్యదర్శి సుదర్శన్ రెడ్డి ఆయా పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముగ్గు రూపం.. గ్రామ ముఖచిత్రం


రంజోల్ గ్రామ పటాన్ని గీస్తున్న విద్యార్థులు

- భాగస్వామ్య గ్రామీణ అనుభవ కార్యక్రమం
- పటం ద్వారా సమస్యల ప్రదర్శన

జహీరాబాద్ టౌన్: హైదరాబాద్‌లోని మల్లారెడ్డి ఉద్యాన కళాశాల విద్యార్థులు సోమవారం జహీరాబాద్ మండలంలోని రంజోల్ గ్రామంలో గ్రామీణ అనుభవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు గ్రామ చిత్రపటాన్ని ముగ్గు రూపంలో చిత్రీకరించారు. నెల రోజులుగా విద్యార్థులు గ్రామంలో ఉంటూ ఏఈఓ ప్రదీప్‌కుమార్ పర్యవేక్షణలో వ్యవసాయంలో రైతులు పంటల సాగులో చేపట్టే యాజమాన్య పద్ధతులు, మెలకువలు, సస్యరక్షణ చర్యలు తదితర విషయాల గురించి తెలుసుకున్నారు. గ్రామీణ అనుభవ కార్యక్రమంలో భాగంగా ముగ్గురూపంలో గ్రామ ముఖచిత్రాన్ని గీసి ప్రభుత్వ భవనాలు, మందిరాలు, ప్రార్థన మందిరాలు, బ్యాంక్‌లు, పోస్టాఫీస్, స్కూళ్లు, పొలాలు, వాగులు, పంటలను గుర్తించారు. 50 సంవత్సరాల క్రితం గ్రామం ఎలా ఉండేది.. ఇప్పుడు ఏ విధంగా ఉందని ప్రజలకు వివరించారు. పలువురు విద్యార్థులు తమ అనుభవాలను పంచుకున్నారు. గ్రామ పరిధిలో నల్ల, ఎర్రరేగడి నేలలు ఉన్నాయని, రైతులు అన్ని రకాల పంటల సాగు చేస్తున్నారని చెప్పారు. ముఖ్యంగా చెరకు, అల్లం, ఆలుతో పాటు ఉద్యాన పంటలను వేస్తూ మంచి లాభాలు అర్జిస్తున్నారన్నారు. నెల రోజుల పాటు రైతులో ఉంటూ పంటల సాగులో మెలకువలను నేర్చుకున్నామన్నారు. ఫీల్డ్ అనుభవం తమకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు.ఇంకా గ్రామంలో రెండు నెలల పాటు ఉంటామన్నారు. కార్యక్రమంలో ఏఈఓ ప్రదీప్‌కుమార్, కేవీకే శాస్త్రవేత్తలు శైలజ, ప్రియాంక విద్యార్థులు పూజిత, ప్రీతి, అలేఖ్య, ప్రైసీ, స్నేహిత, వైష్ణవి పాల్గొన్నారు.

మత్స్యకారుల ఆర్థిక అభివృద్ధికి కృషి


చేపలను వదులుతున్న కార్పొరేటర్, మత్స్యశాఖ జిల్లా అధికారి

పటాన్‌చెరు టౌన్: మత్స్యకారుల ఆర్థిక అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్ అన్నారు. సోమవారం డివిజన్ పరిధిలోని సాకి చెరువు, తిమ్మక్క చెరువుల్లో 86 వేల చేపలను కుమార్‌యాదవ్, మత్స్యశాఖ జిల్లా అధికారి నరసింహారావుతో కలిసి వదిలారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలోని సాకి చెరువులో 61 వేలు, తిమ్మక్క చెరువులో 25 వేల వివిధ రకాల చేపలను వదలామన్నారు. కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ అధికారి నరసింహారావు, కుమార్ ముదిరాజ్, నాయకులు పాల్గొన్నారు.

రాయసముద్రం చెరువులో..

రామచంద్రాపురం (పటాన్‌చెరు): మత్స్యకారుల అభివృద్ధి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని రామచంద్రాపురం కార్పొరేటర్ పుష్ప పేర్కొన్నారు. రామచంద్రాపురం పట్టణంలోని రాయసముద్రం చెరువులో 38వేల చేప పిల్లలను వదిలారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చెరువులకు పూర్వవైభవం తెచ్చేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని చెప్పారు.

ధ్వంసమైన రోడ్లను బాగు చేయండి

బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి


నిరసన చేస్తున్న గోదావరి, పార్టీ శ్రేణులు

పటాన్‌చెరు టౌన్: ప్రభుత్వాలు మారినా రోడ్ల దుస్థితి మారడం లేదని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి మండిపడ్డారు. సోమవారం పటాన్‌చెరు మండలం బచ్చుగూడెం చౌరస్తాలో బీజేపీ మండల అధ్యక్షుడు కావలి వీరేశం, ఉపాధ్యక్షుడు ధనరాజ్ గౌడ్ అధ్యక్షతన నిరసన వ్యక్తం చేశారు. పటాన్‌చెరు నుంచి ఇంద్రేశం మీదుగా కంజర్ల, శివనగర్ వరకు రోడ్డు పూర్తిగా ధ్వంసమయిందని తెలిపారు. ఈ సందర్భంగా గోదావరి మాట్లాడుతూ.. ప్రభుత్వం వెంటనే స్పందించి, రోడ్డు బాగు చేయాలన్నారు. ధ్వంసమైన రోడ్డుతో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, శ్రీనివాస్‌గుప్తా, కన్వీనర్ నర్సింగ్‌రావు, పుణ్యవతి, రాజారెడ్డి పాల్గొన్నారు.

విజయోత్సవాలపై కళాకారుల ప్రదర్శన

జోగిపేట(అందోల్): కలెక్టర్, జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి (డీపీఆర్‌ఓ) ఆధ్వర్యంలో తెలంగాణ సాంస్కృతిక సారథి టీం 2, టీం లీడర్ కొమ్ముల శేఖర్ గౌడ్ నేతృత్వంలోని కళాకారుల బృందం సోమవారం అందోల్, జోగిపేట మున్సిపాలిటీలోని క్లాక్‌టవర్, బసవేశ్వర చౌక్, డబుల్ బెడ్ రూం వద్ద ప్రజాపాలన విజయోత్స వా లు గ్యారెంటీలపై కళా ప్రదర్శనలు నిర్వహించారు. జోగిపేట మున్సిపల్ చైర్మన్ మల్లయ్య, కమిషనర్ తిరుపతి, వైస్ చైర్మన్ ప్రవీణ్, కౌన్సిలర్లు హాజరై రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు పరుస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కలెక్టరేట్‌లో వనభోజనాలు


పూజలు చేస్తున్న అధికారులు జ్యోతి తదితరులు

సంగారెడ్డి జోన్: కలెక్టరేట్‌లో సోమవారం కార్తీక వనభోజనాలు నిర్వహించారు. కలెక్టరేట్ ఆవరణలోని ఫ్రీడమ్ పార్కులో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ పీడీ జ్యోతి ఆధ్వర్యంలో వనభోజన కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ క్రాంతి వల్లూరు, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, ట్రైనీ కలెక్టర్ మనోజ్‌లు ముఖ్యఅతిథులు హాజరైపూజలు చేశారు. కలెక్టరేట్ ఉద్యోగులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.


పూజలు చేసిన మాజీ డీజీపీ తదితరులు

కేతకీలో ప్రత్యేక పూజలు

ఝరాసంగం(జహీరాబాద్): దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన కేతకీ సంగమేశ్వర ఆలయంలో మాజీ డీజీపీ దినేష్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ మర్యాదలతో ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. పార్వతీ పరమేశ్వరులకు అభిషేకం, కుంకుమార్చన, మహామంగళహారతి పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం అర్చకులు స్వామివారి తీర్థప్రసాదాలు అందించి, పూలమాల, శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో జహీరాబాద్ రూరల్ సీఐ హన్మంతు, ఎస్ఐ నరేష్ పాల్గొన్నారు.

ఎస్టీ హాస్టల్ తనిఖీ


విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న అధికారులు

జహీరాబాద్ టౌన్: మండల కేంద్రం మొగుడంపల్లిలోని ఎస్టీ హాస్టల్‌ను సోమవారం అధికారులు తనిఖీ చేశారు. హాస్టల్‌లోని విద్యార్థుల గదులు, వంట గది, పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజన చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మహేశ్, తహసీల్దార్ హసీనా బే గం, ఎంఈఓ జాఫర్‌అలీ, ఎంపీఓ సంజయ్ కుమార్, ఆర్ఐ సాయికిరణ్, ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.

వీరభద్రుడికి ప్రత్యేక పూజలు

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మండలం వీరన్న గూడెంలోని ప్రసిద్ధ శైవ క్షేత్రం వీరభద్ర స్వామి ఆలయంలో చివరి కార్తీక సోమవారం సందర్భంగా భక్తుల సందడి నెలకొంది. దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్ ఆలయాన్ని దర్శించుకొని భద్రకాళి సమేత వీరభద్రుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ శశిధర్, పర్యవేక్షకులు సోమయ్య సిబ్బంది కమిషనర్‌కు స్వాగతం పలికారు. కుంకుమార్చనలు రుద్రాభిషేకాలు వంటి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

క్లుప్తంగా

అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు


అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న అధికారులు

పటాన్‌చెరు టౌన్: కూల్చివేసిన అక్రమ కట్టడాలను మళ్లీ నిర్మిస్తే కఠిన చర్యలు ఉంటాయని ఇంద్రేశం గ్రామ పంచాయతీ కార్యదర్శి సుభాష్ హెచ్చరించారు. పటాన్‌చెరు మండలం ఇంద్రేశం గ్రామంలో గ్రామపంచాయతీ నుంచి తీసుకున్న అనుమతులకు మించి నిర్మాణాలు చేస్తుండటంతో నోటీసులు జారీ చేశారు. అయినా పట్టించుకోకుండా నిర్మాణాలు చేస్తుండటంతో సోమవారం కూల్చివేసినట్లు కార్యదర్శి సుభాష్ తెలిపారు. గ్రామపంచాయతీ నుంచి తీసుకున్న అనుమతులు మేరకే నిర్మాణాలు చేపట్టాలని సూచించారు.

శిలువకు నిప్పు


ఘటనాస్థలాన్ని పరిశీలిస్తున్న గ్రామస్తులు

నారాయణఖేడ్: మండలంలోని సత్తెగామ గ్రామ చౌరస్తా వద్ద ఉన్న శిలువ చుట్టూ కట్టెలు పేర్చి గుర్తుతెలియని వ్యక్తులు ఆదివారం రాత్రి నిప్పుపెట్టారు. సోమవారం ఉదయం గుర్తించిన గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. దుశ్చర్యకు పాల్పడ్డ వారిని గుర్తించి, కఠినంగా శిక్షించాలన్నారు. మున్ముందు ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాలని కోరారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

జాతీయ పోటీలకు ఎంపిక



విద్యార్థి ఇస్మాయిల్‌తో కరాటే మాస్టర్లు

ఝరాసంగం(జహీరాబాద్): పెద్దపల్లి జిల్లాలో జరిగిన అండర్‌- 17 రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో మోడల్ స్కూల్ విద్యార్థి ఎస్‌కె. ఇస్మాయిల్ సత్తా చాటి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఆదివారం నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో బంగారు పతకం సాధించాడు. డిసెంబర్‌లో ఢిల్లీలో జరిగే కరాటే పోటీల్లో పాల్గొంటారు. విద్యార్థిని ప్రిన్సిపాల్ టేనావతి, కరాటే మాస్టర్ సిద్ధుస్వామి, చందర్ మాస్టర్, శంకర్ మాస్టర్, సతీష్ గౌడ్ అభినందించారు.

ఘనంగా మహా పడిపూజ



సదాశివపేట(సంగారెడ్డి): పట్టణంలోని అయ్యప్ప మందిరంలో బత్తుల అనిల్‌కుమార్ 18వ మహాపడిపూజను ఆదివారం ఘనంగా నిర్వహించారు. గురుస్వాములు సుధాకర్‌గౌడ్, గోనేశంకర్, విశ్వనాథం, చింతా గోపాల్, సోమశేఖర్, వీర్‌కుమార్‌ల ఆధ్వర్యంలో పడిపూజ చేశారు. భక్తులు భారీగా తరలివచ్చారు. అయ్యప్ప నామస్మరణతో ఆలయం మార్మోగింది. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, మున్సిపల్ చైర్ పర్సన్ అపర్ణ, కౌన్సిలర్లు చౌదరి ప్రకాష్ , నల్ల శివలక్ష్మి, అకుల శివకుమార్, పిచార్యాగడి శివకుమార్, టీఆర్ఎస్ జిల్లా నాయకులు, బీజేపీ ఇన్‌చార్జి జగదీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత బాధ్యత

సంగారెడ్డి క్రైమ్: జిల్లా కేంద్రంలో జరిగిన వైజ్ఞానిక ఇన్‌స్పైర్ కార్యక్రమం ముగిసింది. పాఠశాల ఆవరణ, పార్కులో పూర్తిస్థాయిలో చెత్తచెదారం నిండింది. దీంతో ఎన్‌సీసీ విద్యార్థులు సోమవారం స్వచ్ఛత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. స్వచ్ఛత అభియాన్‌లో భాగమైనందుకు సంతోషిస్తున్నామన్నారు. పరిసరాల పరిశుభ్రతను శుభ్రం చేయడం మా బాధ్యత, కర్తవ్యమన్నారు. అలాగే స్వచ్ఛతలో ప్రజలు సైతం పాల్గొనాలని పిలుపునిచ్చారు.

మహాసభలను జయప్రదం చేయండి

పటాన్‌చెరు టౌన్: సంగారెడ్డిలో మొదటిసారిగా నిర్వహిస్తున్న సీపీఎం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రాజయ్య పిలుపునిచ్చారు. సోమవారం పటాన్‌చెరు పట్టణంలోని అస్సాం కార్బన్ కార్మికుల సమావేశంలో రాజయ్య మాట్లాడుతూ.. జనవరి 25 నుంచి 28 తేదీల్లో సంగారెడ్డిలో రాష్ట్ర మహాసభలు జరుగుతున్నాయని, ఈ మహాసభలకు ఆర్థికంగా సహకరించాలని కోరారు. ఈ మహాసభలకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల, పట్టణాల నుంచి నాయకులు, ప్రజలు హాజరవుతున్నారన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **ఆలయాల నిర్మాణాలకు సహకారం**

పటాన్‌చెరు టౌన్: నూతన దేవాలయాల నిర్మాణాలకు సంపూర్ణ సహకారం అందిస్తున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని పటేల్ గూడ సిద్ధార్థ కాలనీలో నూతనంగా నిర్మించనున్న కట్ట మైసమ్మ దేవాలయం పనులకు సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దైవచింతన ద్వారా మానసిక ప్రశాంత కలుగుతుందన్నారు. నియోజకవర్గం వ్యాప్తంగా సొంత నిధులతో 200కు పైగా దేవాలయాలు నిర్మించామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దేవానందం , మాజీ జెడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, శ్రీకాంత్, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

◆ **మున్సిపల్ భవనానికి భూమిపూజ**

జోగిపేట(అందోల్): జోగిపేట పట్టణంలో రూ.6 కోట్లతో నిర్మించతలపెట్టిన అందోల్‌-జోగిపేట మున్సిపాలిటీ నూతన భవన నిర్మాణ పనులకు సోమవారం భూమి పూజ చేశారు. పురాతన స్థానిక తహసీల్దార్ నివాస గృహస్థలంలో ఈ పనులకు సంబంధించి గతంలో మంత్రి దామోదర రాజనర్సింహ శంకుస్థాపన చేసిన విషయం తెలిసిందే. పనులను ప్రారంభించేందుకు సోమవారం మున్సిపల్ చైర్మన్ జి.మల్లయ్య, కమిషనర్ తిరుపతి, కౌన్సిలర్లు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఏఈ శ్రీకాంత్, మున్సిపల్ కౌన్సిలర్లు శివశంకర్, సురేందర్ గౌడ్, చిట్టిబాబు, రంగ సురేష్, నాగరాజ్, హరికృష్ణా గౌడ్, దుర్గేష్, మాజీ కౌన్సిలర్ పాల్గొన్నారు.

◆ **ప్లాట్లు చూపాలంటూ నిరసన**

పటాన్‌చెరు: తము కొనుగోలు చేసిన ప్లాట్లు అమీన్‌పూర్ పెద్ద చెరువులో మునిగిపోయాయి. కారణం ఇరిగేషన్ అధికారులు అంటూ ప్లాట్లు కొనుగోలు చేసిన వారు సోమవారం పటాన్‌చెరు ఇరిగేషన్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ప్లాట్ల యజమానులంతా సంఘంగా ఏర్పడి గత నెల రోజులుగా నిరసన వ్యక్తం చేస్తున్నారు. అమీన్‌పూర్ పెద్ద చెరువు నీటిని వదలడంతో 5వేల ప్లాట్లు మునిగిపోయాయని వాపోయారు. దీనికి ప్ర ధాన కారణం ఇరిగేషన్ అధికారులేనని ఆవేదన వ్యక్తం చేశారు. చెరువులో నీటిని ఖాళీ చేసి ప్లాట్లను చూపాలని అసోసియేషన్ ప్రతినిధులు డిమాండ్ చేస్తున్నారు.

◆ **ఆరుగురు జూదరుల అరెస్టు**

కల్హేర్(నారాయణఖేడ్): పేకాట ఆడుతున్న 6 మంది జూదరులను అరెస్టు చేసినట్లు సిర్గాపూర్ ఎస్ఐ డి.వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం సిర్గాపూర్ మండలం నల్లవాగులో పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో దాడి చేసి గ్రామానికి చెందిన మేత్రి శంకర్, నాగభూషణం, గుడిసెల మల్లయ్య, కల్లెంగారి దుర్గగౌడ్, మేత్రి సాయిలు, బుజరంపల్లి సాయిలును అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామని చెప్పారు. వీరి నుంచి రూ. 1300 నగదు, 3 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని వివరించారు.

◆ **మందుబాబులకు జరిమానా**

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం నిర్వహించిన డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో 20 మందిని పట్టుకున్నట్లు చెప్పారు. వారిని సోమవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపరచగా 19 మందికి ఒక్కొక్కరికి రూ. 2 వేలు జరిమానా, ఒకరికి రూ.1500 జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు చెప్పారు.

◆ **ట్రైనీ అధికారుల బృందం పర్యటన**



పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు మండలం నందిగామలో యుపీఎస్సీ ట్రైనీ అధికార బృందం సోమవారం పర్యటించింది. గ్రామ కార్యదర్శి రాజేందర్ వారిని గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలను, అంగన్‌వాడీ కేంద్రాన్ని చూపించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందుతున్న విద్యను పరిశీలించారు. మౌలిక వసతులను చూశారు. మధ్యా హ్నా భోజనాన్ని స్వయంగా తిని సంతృప్తి వ్యక్తం చేశారు. ఉపాధ్యాయుల విద్యాబోధనను నిశితంగా పరిశీలించి వాటిని రికార్డు చేసుకున్నారు. విద్యార్థులతో సరదాగా గడిపారు. కార్యక్రమంలో శిక్షణ అధికారులు బాలాసాహేబ్, చేతన్‌కుమార్ , స్వాతి సందీప్ రేవల్లి వసంత్కార్, స్వాతి గుప్తా పాల్గొన్నారు.

◆ **బస్సు సౌకర్యం కల్పించాలని వినతి**

జిన్నారం (పటాన్‌చెరు): మారుమూల గ్రామాల నుంచి కళాశాల స్థాయిలో చదువుకునే విద్యార్థులకు రవాణా సౌకర్యం లేకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నారని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు సోమవారం జీడిమెట్ల డిపో మేనేజర్‌ను స్థానిక నాయకులతో కలిసి విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యార్థులు ప్రయాణికులకు ఆర్టీసీ అధికారులు రవాణా సేవలను కల్పించాలని విజ్ఞప్తి చేశారు. బొంతపల్లి వరకు నడుస్తున్న ఆర్టీసీ ఆర్డినరీ బస్సులను గుమ్మడిదల మండల కేంద్రం వరకు పొడిగించాలన్నారు. నాయకుల విజ్ఞప్తికి మేనేజర్ స్పందించి త్వరలోనే బస్సులను పొడిగిస్తామని హామీ ఇచ్చారు.